ప్రజాశక్తి
శనివారం 23 డిసెంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

తెరపైకి మలసాల భరత్

◆ అమర్‌పై పెరుగుతున్న అసంతృప్తి ◆ సిట్టింగ్ స్థానం దక్కించుకునే యోచనలో సిఎం
◆ ప్రారంభమైన ఎన్నికల కసరత్తు

సిఎం జగన్‌తో మలసాల కుటుంబీకులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మళ్లీ అనకాపల్లి నుంచి పోటీచేసే అవకాశముందా ? అంటే దాదాపు లేదనే ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ ప్రజలకే కాదు, పార్టీ క్యాడర్‌కూ దూరంగా వుంటున్నారన్న అసంతృప్తి ఆ పార్టీలోనే తీవ్రంగావుంది. ఎమ్మెల్యేగా వున్న కాలంలోనూ, మంత్రి పదవి వచ్చిన తరువాత ఆయన వ్యవహారశైలిలో మార్పు లేకపోవడంతో పార్టీలో అనేక మంది నాయకులు కాస్త దూరం పాటిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సన్ని హితునిగా మంత్రి వున్నప్పటికీ గెలవలేని చోట సిట్టింగ్‌లకు టిక్కెట్ ఇవ్వబోనని సిఎం చెబుతూ వస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి టిక్కెట్ కొత్తవారికి ఇవ్వనున్నట్లు సిఎం సూచనప్రాయంగా అమర్‌కు చెప్పినట్లు తెలిసింది. అధిష్టానం నుంచి ఈ తరహా సంకేతాలు రావడంతో యలమంచిలి, చోడవరం, గాజువాక నియోజకవర్గాల్లోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న ఆలోచనలో అమర్ వున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మార్పుతో గాజువాక నుంచి పోటీచేసే అవకాశం లేదు. యలమంచిలి, చోడవరం నియోజకవర్గాల్లో తన సామాజిక తరగతులను కూడగట్టి పోటీ చేయాలని ఎంత ప్రయత్నించినా ఆ రెండు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లను కాదని అమర్‌కు టిక్కెట్ ఇవ్వరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజును కాదని టిక్కెట్ సంపాదించడం అమర్‌కు అంత సులువుకాదు. రాబోయే ఎన్నికల్లో పోటీకి సీటు పొందలేని స్థితి అమర్‌కు ఎదురుకానుంది. టిడిపికి ధీటైన వ్యక్తిని బరిలో నిలబెట్టాలన్న ఆలోచనలో అమర్‌కు బదులు కొత్త వ్యక్తిని తెరమీదకు తీసుకురానున్నట్లు తెలిసింది. అనకాపల్లి నియోజకవర్గంలోని కశింకోట మండలానికి చెందిన మాజీ ఎంపిపి మలసాల కాసులమ్మ (ధనమ్మ), విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు తనయుడు భరత్ కుమార్‌కు వచ్చే ఎన్నికల్లో వైసిపి మిగతా 2లో..

కశింకోటలో సుత్తి కొడవలి ఆకారంలో కూర్చుని ఆందోళన కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు

వార్తలు 8లో..

రాస్తారోకోలు.. వినూత్న నిరసనలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె - తగరపువలసలో 60 మంది అరెస్టు

అంగన్‌వాడీల జీతాలెందుకు పెంచరు ?

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అంగన్వాడీల జీతాలు పెంచం అని చేసిన ప్రకటనను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ఖండించారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పెంచం అని చెప్పిన మంత్రి ఉషశ్రీ చరణ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి జీతాలు పెంచాలన్నారు. లేనిపక్షంలో కార్మిక సంఘాలన్నీ కలిసి ఉద్యమించి ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. 11 రోజులు నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. అంగన్వాడీలకు మిగతా 2లో..

విశాఖ ఉక్కుపై కుట్రలు తీవ్రం

వార్త 2లో..

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

వార్త 6లో..

నగరంలో ఎక్మో చికిత్స విజయవంతం

వార్త 2లో..

విశాఖలో నిరసన తెలుపుతున్న వేదిక నాయకులు

వార్త 5లో..

బిజెపిని చిత్తుగా ఓడించండి

ఇండియా వేదిక ఆధ్వర్యాన నిరసనలు

నగరంలో కోవిడ్ కలకలం !

◆ వాంబే కాలనీలో వ్యక్తికి ర్యాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్‌గా నిర్ధారణ
◆ ఆర్‌టిపిసిఆర్ పరీక్షల ఫలితాలకు ఎదురుచూపు
◆ హోం క్వారంటైన్‌లో వైద్యసేవలు

ప్రజాశక్తి - పిఎం.పాలెం: మధురవాడ వాంబే కాలనీలో కరోనా కలకలం రేగింది. జివిఎంసి ఏడో వార్డు వాంబే కాలనీకి చెందిన ఒక వ్యక్తి ఇటీవల జ్వరంతో బాధపడుతూ స్థానిక పిహెచ్‌సికి వైద్యసేవలకు వెళ్లగా అక్కడ ఆయనకు కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్ చేశారు. ఆ పరీక్ష మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తెరపైకి మలసాల భరత్

టిక్కెట్ ఇవ్వనున్నట్లు సమాచారం. జగన్మోహన్‌రెడ్డిని మలసాల కుటుంబీకులు కలిసినప్పుడు భరత్‌కుమార్‌కు అనకాపల్లి టిక్కెట్ ఇచ్చేందుకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. మంత్రి అమర్ సామాజిక తరగతికి చెందిన భరత్ కుమార్‌కు టిక్కెట్ ఇస్తే ఎన్నికల ఫలితాలు సానుకూలంగా వుంటాయన్న ఆశతో సిఎం వున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మిందికి చెందిన అమర్ గత ఎన్నికల్లో అనకాపల్లి నుంచి గెలిచారు. నియోజకవర్గ కేంద్రంలో అందుబాటులో వుండకపోవడం, సొంతిళ్లు మింది నుంచి ఆయన కార్యకలాపాలన్నీ కొనసాగించడం, కార్యకర్తలు వెళ్లినా పట్టించుకోకపోవడం వంటి పలు కారణాలు మంత్రి పట్ల పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి పెరగడానికి దారితీశాయి. సీనియర్ నాయకులతో మంత్రికి సఖ్యతలేదు. వచ్చే ఎన్నికల నాటికి క్యాడర్‌లో ఈ అసంతృప్తి తగ్గే అవకాశం లేకపోవడంతో కొత్త వారికి టిక్కెట్ ఇవ్వాలన్న యోచనలో సిఎం వున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో భరత్ కుమార్ పోటీ చేయడానికి ఆసక్తి చూపడంతో సిఎం ఆయనకు టిక్కెట్ ఇవ్వడానికి మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనికి ముందు మంత్రిని ఒప్పించి నియోజకవర్గ నాయకత్వంతో మాట్లాడిన తరువాత ఇన్‌ఛార్జ్‌గా భరత్ కుమార్‌ను నియమించనున్నట్లు తెలుస్తోంది.

అంగన్‌వాడీల జీతాలెందుకు పెంచరు

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ పెంచే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. నాలుగేళ్లుగా వైసిపి ప్రభుత్వం అంగన్‌వాడీలకు జీతాలు పెంచలేదని, మరోవైపు ధరలు మాత్రం రెట్టింపు అయ్యాయని అన్నారు. సెంటర్ల అద్దెలు కూడా పెరిగాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు భత్యం ప్రకారం 469 పాయింట్లు పెరిగాయన్నారు. దీనికి రూ.3,630 నెలకు అదనంగా ఇవ్వాలన్నారు. అంగన్వాడీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని, వారికి జీతాలు పెంచేది లేదని రాష్ట్ర ప్రభుత్వం నాటకాలు ఆడటం సరికాదని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం గత నాలుగేళ్ల బడ్జెట్‌లో అంగన్వాడీలకు నిధులు పెంచలేదని తెలిపారు. ట్రేడ్ యూనియన్లన్నీ అంగన్వాడీలకు పూర్తి మద్దతు తెలుపుతున్నాయని స్పష్టం చేశారు. వచ్చే వారంలో మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు వై.తులసి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శోభారాణి పాల్గొన్నారు.

నగరంలో కోవిడ్ కలకలం !

పాజిటివ్‌గా వచ్చిందని వైద్యాధికారి వెల్లడించారు. సమాచారాన్ని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించగా వారి సూచనల మేరకు ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు వచ్చేందుకు రెండు, మూడు రోజులు పట్టే అవకాశమున్నందున బాధిత వ్యక్తికి హోం క్వారంటైన్‌లో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌టిపిసిఆర్ పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాతే పూర్తి వివరాలను వెల్లడిస్తామని వైద్యులు అంటున్నారు.

వాసుపల్లికి సీటు ఇస్తే మత్స్యకారులు ఓడిస్తారు

ప్రజాశక్తి – కలెక్టరేట్ : త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో దక్షిణ నియోజకవర్గం వైసిపి టిక్కెట్టును ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కి ఇస్తే.. మత్స్యకారులు అతనికి పోటీగా అభ్యర్థిని నిలిపి ఓట్లు చీల్చి అయన్ని గద్దె దించుతారని నియోజవర్గానికి చెందిన మత్స్య పారిశ్రామిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వాడమదులు పెంటయ్య మాస్టారు, ప్రధాన కార్యదర్శి చింతపల్లి అయ్యప్పరాజు, తీర ప్రాంత వాడబలిజ సంఘం కార్యదర్శి కండిపల్లి రామకష్ణ, మత్స్యకార నాయకుడు తెడ్డు శంకర్ అన్నారు. శుక్రవారం పాత నగరం చిలకపేట జంక్షన్‌లో ఉన్న 39వ వార్డు గంగపుత్ర మత్స్యకార వాడ బలిజ సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రవర్తనపై కొన్ని రోజులుగా అధికార వైసిపికి చెందిన కార్పొరేటర్లు అసహనం వ్యక్తపరుస్తూ పార్టీలు మారుతున్నారని తెలిపారు. గణేష్ కుమార్ మత్స్యకార సామాజిక తరగతికి చెందిన నాయకుడు అయినప్పటికీ మత్స్యకారుల కోసం ఏనాడూ సహాయ సహకారాలు అందించలేదన్నారు. గణేష్ కుమార్‌కు బదులు మత్స్యకార నాయకుడు, యువకుడు, విద్యావేత్త వాసుపల్లి జానకిరామ్‌కు వైసిపి టికెట్ కేటాయిస్తే మత్స్యకారులంతా మద్దతు తెలిపి గెలిపించుకుంటామని వారన్నారు.

98 డివిజన్లకు జనసేన అధ్యక్షులు

ప్రజాశక్తి – కలెక్టరేట్ : జివిఎంసి పరిధి 98 డివిజన్లకు జనసేన పార్టీ తరపున అధ్యక్షులను ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. పార్టీ అర్బన్ సమన్వయ బాధ్యతలను కోన తాతారావుకు అప్పగించారు.

విశాఖ ఉక్కుపై కుట్రలు తీవ్రం

జిందాల్‌తో ఒప్పందాన్ని రద్దు చేయాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి – ఉక్కునగరం : విశాఖ ఉక్కుపై కేంద్రం కుట్రలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు హానికరమైన జిందాల్‌తో ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు వర్కింగ్ కమిటీ సమావేశం ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ స్టీల్ యాజమాన్యం వాటిని పరిగణనలోకి తీసుకోకుండా జిందాల్‌తో ఒప్పందం చేసుకోవడంపై మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలను అప్పగించడం కోసం జరిగే కుట్రగా దీనిని అభివర్ణించారు. స్థానిక స్టీల్ యాజమాన్యం నేటి వరకు జరుగుతున్న ఐక్య ఉద్యమాన్ని బలహీనపరచడం కోసం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. ఐక్య ఉద్యమాన్ని కొనసాగించే విధంగా కార్మిక వర్గాన్ని చైతన్యంగా ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ జిందాల్‌తో ఒప్పందం ద్వారా కర్మాగారానికి నష్టం జరుగుతుందని వివరించారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపడం ద్వారా కర్మాగారాన్ని రక్షించవచ్చన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు జగ్గు నాయుడు, కెఎం.శ్రీనివాస్, 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్ సిఐటియు నాయకులు యు.వెంకటేశ్వర్లు, కెవి.సత్యనారాయణ, టివికె. రాజు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

కేర్ హాస్పిటల్స్‌లో ఎక్మో చికిత్స విజయవంతం

ప్రజాశక్తి – కలెక్టరేట్ : వెంటిలేటర్ సపోర్టు, అత్యధిక ఆక్సిజన్ వినియోగం, అధిక రక్తపోటు, హెచ్ త్రీ, ఎన్ టు సంబంధిత ఊపిరితిత్తుల సమస్యతో అత్యంత విషమంగా ఉన్న 54 సంవత్సరాల వ్యక్తికి నగరంలో ఉన్న కేర్ హస్పిటల్స్‌లో ఎక్మో చికిత్సను విజయవంతంగా అందించారు. క్రిటికేర్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ మోనంగి, డాక్టర్ టిఎల్.రాణి నేతృత్వంలో క్రిటికల్ కేర్ వైద్యులు రాము సభ్యులుగా ఉన్న ఈ వైద్య బృందం డాక్టర్ శ్రీనివాస్ మోనంగి ఆధ్వర్యంలో అత్యంత సంక్లిష్టమైన చికిత్సను అందించినట్లు హాస్పిటల్ పరిపాలనాధికారి శ్రీనివాస్ వద్దిపర్తి తెలిపారు. శుక్రవారం కేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్మో సేవలు చాలా అరుదుగా అందుబాటులో ఉన్నాయని, పేషంట్ తమ వద్దకు వచ్చేసరికే అత్యంత విషమంగా ఉన్నారని, ఎక్మో గురించి సుదీర్ఘంగా వివరించి, చికిత్స వల్ల ఉన్న ఉపయోగాలను కుటుంబ సభ్యులకు తెలియజేశామని తెలిపారు. ఎక్మోపై 14 రోజుల సుదీర్ఘ చికిత్స తరువాత రోగి కోలుకున్నారని వెల్లడించారు. డాక్టర్ శ్రీనివాస్ మోనంగి మాట్లాడుతూ చాలా సందర్భాలలో అవగాహన లేకపోవడం ఒక స్థితి అయితే, సుశిక్షితులైన వైద్య బృందం అందుబాటులో లేకపోవడం మరొక పరిస్థితని వివరించారు. పేషెంట్ మాట్లాడుతూ తనకు పునర్జన్మనిచ్చిన వైద్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్‌కు, ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైద్యులు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ టిఎల్.రాణి, డాక్టర్ ఎం.రాము, డాక్టర్ హరీష్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న కేర్ వైద్యులు

995వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి – కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 995వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపిఎస్ నాయకులు ఎం.సుబ్బన్న, వైఎస్ఆర్‌టియు నాయకులు వై.మస్తానప్ప, కూరపాటి అప్పారావు కూర్చున్నారు

IN THE HON'BLE COURT OF THE II ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM
I.A.493/2023 in A.S.110/2023

Between:
Sri Thonangi Venkata Venu Gopalakrishna ...Petitioner/Appellant
And
Botta Murali Krishna and 2 others ...Respondents

NOTICE

To,
R-2: Sri Pinninti Bhaskara Rao, S/o. late Ramu, Hindu, aged 49 years, R/at 14-1-27/3, Nowroji Road, Pandimetta, Maharanipeta, Visakhapatnam.

Whereas the above-named petitioner/Appellant filed A.S.110/2023 by challenging the decree and judgment passed by the Hon'ble II Addl.Senior Civil Judge Court at Visakhapatnam in O.S.1330/2013, along with I.A.493/2023 for stay of operation of the decree and the same is stands posted to **05-01-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **05-01-2024** at **10:30 A.M** to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
S.S. CHALAM, Advocate
Visakhapatnam, Cell: 9440615945.

IN THE HON'BLE COURT OF THE II ADDL. DISTRICT JUDGE AT : VISAKHAPATNAM
A.S.110/2023

Between:
Sri Thonangi Venkata Venu Gopalakrishna ...Appellant
And
Botta Murali Krishna and 2 others ...Respondents

NOTICE

To,
R-2: Sri Pinninti Bhaskara Rao, S/o. late Ramu, Hindu, aged 49 years, R/at 14-1-27/3, Nowroji Road, Pandimetta, Maharanipeta, Visakhapatnam.

Please take notice that the above-named Appellant herein has filed the above Appeal against the decree and Judgement passed by the Hon'ble II Addl. Senior Civil Judge Court at Visakhapatnam in O.S.1330/2013 and the Appeal stands posted to **05-01-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **05-01-2024** at **10:30 A.M** to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
S.S. CHALAM, Advocate
Visakhapatnam, Cell: 9440615945.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
S.O.P. 23/2023

Between:
1) **Sri Pampana Satya Babu,** S/o. late Appa Rao, R/at D.No.32-20-1, Atchiyyammapeta, Visakhapatnam
2) **Sri Pampana Narasimha Murthy,** S/o. late Appa Rao, Rest-do- ...Petitioners
And
Nil ...Respondents

GENERAL PUBLIC NOTICE

The public in general are hereby informed that the above numbered petition to issue succession certificate in favour of the petitioners. The above matter stands posted to **09-01-2024** at **10:30 A.M.** As declaring the petitioners as legal heirs of late Smt. Pampana Appala Kondamma and also entitled to schedule mentioned property i.e., compensation amount of land Acquisition case in E.P.139/1988 in O.P.142/1979 on the file of the Hon'ble II Addl. Senior Civil Judge Court at Visakhapatnam.Therefore, the public in general are hereby informed that if anyone having any objection in the above matter please appear in person or by a pleader duly instructed and to above case. Failing which the Hon'ble Court will pass an appropriate orders to that of spect.

B. SRINIVASA RAO, Advocate
Visakhapatnam, Cell: 9948246316.

గ్రామ పంచాయతీ కార్యాలయము – ఈ.బోనంగి

టెండరు ప్రకటన **తేదీ.21-12-2023**

అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, ఈ.బోనంగి గ్రామపంచాయితీలో పరిధిలో జనావాస ప్రదేశాలలో అనగా గుళ్ళు పంచాయతీ కార్యాలయం, నాలుగు రోడ్ల కూడల్లు, పాఠశాలలు ఇతర ప్రదేశాల్లో సీసీ కామెరాలు ఏర్పాటు చేయుటకు శ్రీ జిల్లా పంచాయతీ అధికారి వారు గతంలో ఇచ్చిన E-File No. 286522/2021/E4, Date : 23/09/2021 అర్జెంట్ మెమో ప్రకారము CC కామెరాలు ఏర్పాటు చేయుటకు పంచాయితీ వారు సీల్డుటెండర్లు (కొటేషన్లు) కోరబడుచున్నవి. టెండర్లుదారులు ప్రభుత్వ సంస్థ అయినా "The Visakhapatnam Co-operative Central Stores Ltd No.B1351 (Super Bazzar)" విశాఖపట్నం వారి వద్ద నుండి సీసీ కెమెరాలను సంబంధించిన మొత్తం సామాగ్రిని కొనుగోలు చేసి పంచాయతీ వారు చూపించిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు అమర్చుటకు సీల్డ్ టెండర్లు (కొటేషన్లు) కోరబడుచున్నవి మరియు జిల్లా పంచాయతీ అధికారి వారు వారి ఉత్తర్వులకు లోబడి సదరు పనికి అయిన సొమ్ములను గ్రామపంచాయతీ సాధారణ నిధుల నుండి సూపర్ బజార్ వారికి చెల్లించడం జరుగుతుంది. టెండరు తేదీ: 22-01-2023 మధ్యాహ్నం 3 గంటల వరకు తీసుకొని అదేరోజు హాజరైన టెండరు దారు సమక్షంలో పంచాయితీ కార్యాలయంలో టెండర్లు తెరవబడును. మిగిలిన విషయాలు పంచాయితీ కార్యాలయం పని చేయు వేళల్లో తెలుసుకొనవచ్చును. టెండరులో పాల్గొనే వారు 500/- రూపాయలు ధరావత్తు చెల్లించవలెను. టెండర్లును వాయిదా వేయుటకు గాని రద్దు చేయుటకు గాని ఈక్రింది సంతకదారుని యొక్క అధికారికి కలదు.

సం/- జి.వి.నాగభూషణరావు పంచాయితీ కార్యదర్శి
ఈ.బోనంగి గ్రామపంచాయితీ, పరవాడ మండలం

గ్రామ పంచాయతీ కార్యాలయము – ఈ.బోనంగి

రేఖా నెం.01/2022 **టెండరు నోటీసు** **తేదీ.10-02-2023**

అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం, ఈ.బోనంగి గ్రామ పంచాయితీలో 2024-25 సంవత్సరమునకుగాను పంచాయితీ పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిపై పారిశుధ్యం పనులకు ముగ్గురు, ఎలక్ట్రికల్‌కు ఒకరిని, మంచినీటి సరఫరా ట్యాంక్లు నిర్వహణకు ఇద్దరు, అదే విధముగా బ్లీచింగ్, లైమ్, ఫీనాయిలు మరియు ఇతర పారిశుధ్య సామగ్రి మరియు వీధి దీపాల సామగ్రి సప్లయ్ చేయుటకు అదే విధముగా వీధి కుక్కలను సురక్షతంగా పట్టి కుటంబ నియంత్రణ ఆపరేషన్ చేయుటకు గాను, సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు తేది: 22-01-2024 మధ్యాహ్నం 3 గంటల వరకు తీసుకొని అదేరోజు హాజరైన టెండరుదారు సమక్షంలో పంచాయితీ కార్యాలయంలో టెండర్లు తెరవబడును. టెండర్లు దాఖలు చేయు వ్యక్తులు తప్పనిసరిగా నెల మనిషికి రేటు తెలుపవలెను. అదే విధంగా మెటీరియల్ యొక్క ఒకక్క దాని విలువ తెలపవలెను. మిగిలిన విషయాలు పంచాయితీ కార్యాలయం పని చేయు వేళల్లో తెలుసుకొనవచ్చును. టెండర్లును వాయిదా వేయుటకు గాని రద్దు చేయుటకు గాని ఈ క్రింది సంతకదారుని యొక్క అధికారికి కలదు.

వ. నెం	పని పేరు	తేదీ	టెండరు ధరావత్తు
1	శానిటేషను పనులు	1-4-2024 టు 31-03-2025	300/-
2.	ఎలక్ట్రీషియన్	1-4-2024 టు 31-03-2025	200/-
3.	పి.డబ్ల్యు.ఎస్. స్కీమ్	1-4-2024 టు 31-03-2025	300/-
4.	పారిశుద్య సామగ్రి సప్లయ్ (బ్లీచింగ్, లైమ్, & ఫినాయిలు)	1-4-2024 టు 31-03-2025	600/-
5.	వీధి దీపాల సామగ్రి సప్లయ్	1-4-2024 టు 31-03-2025	600/-
6.	వీధి కుక్కలను సురక్షతంగా పట్టి కుటంబ నియంత్రణ ఆపరేషన్ చేయుటకు గాను	2024-2025	200/-

సం/- జి.వి.నాగభూషణరావు, పంచాయితీ కార్యదర్శి
ఈ.బోనంగి గ్రామపంచాయితీ, పరవాడ మండలం

గణిత మేధావి, శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. గణిత నమూనాలతో ప్రదర్శనలు నిర్వహించారు. గణిత అంశాలతో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ఘనంగా గణిత దినోత్సవం

శ్రీనివాస రామానుజన్‌కు ఘననివాళి... ఆకట్టుకున్న గణిత ప్రాజెక్టు నమూనాలు

పిఎం.పాలెంలో విజేతలకు బహుమతుల ప్రదానం

నక్కపల్లిలో రామానుజన్‌కు నివాళులు

ప్రజాశక్తి- పిఎం పాలెం: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, గణిత రంగవల్లులు పోటీలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు తయారుచేసిన 150 గణిత ప్రాజెక్టులతో ఏర్పాటుచేసిన గణితవిజ్ఞాన ప్రదర్శనను హెచ్‌ఎం ఎం.రాజబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు సిహెచ్. స్వామి, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పిల్లా సూరిబాబు, ఎపి ఎస్‌సి ఒఎస్‌టి జిల్లా బాధ్యులు రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలతాంబ విద్యానికేతన్‌లో....

మాలతాంబ విద్యానికేతన్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సి) గణిత విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థుల వినూత్న నమూనాలు ఆకట్టుకున్నాయి. జివిఎంసి రెండో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, రిటైర్డ్ ఎఎస్‌పి టిఎస్‌ఆర్. ప్రసాద్, ఎన్ఐఎఫ్ఎస్. విద్యాసంస్థల అధినేత సునీల్ మహంతి, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వి హనుమంతరావు, జి.గోపాల్ ప్రదర్శనను తిలకించగా, విద్యార్థులకు తమ నమూనాలపై విశ్లేషణాత్మకంగా వారికి వివరించారు. ప్రిన్సిపాల్ ఎ.ఆదిమూర్తి, వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీదేవి, గణితం అధ్యాపకులు శ్రావణి, సహిన, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కాలేజీలో...

మధురవాడలోని సాంకేతిక విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవంలో గీతం కళాశాల మ్యాథ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. జోగారావు పాల్గొన్నారు. కళాశాల యాజమాన్యం ఇడి ఎస్.రాహుల్ అల్వార్‌దాస్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధు భట్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జె.ఆనంద్‌చందూలాల్, అడ్మిషన్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌సి అనిల్ పాల్గొన్నారు.

తగరపువలస: స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గణిత దినోత్సవంలో విజయనగరం, జెఎన్‌టియు, మేథమెటిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాపారావు పాల్గొన్నారు. అన్ని సాంకేతిక విభాగాల్లో గణితం ప్రముఖపాత్ర పోషిస్తుందని, ఇంజనీరింగ్ విద్యార్థులు గణితంలో ప్రావీణ్యం సంపాదించుకొని ఉన్నత భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. గణితంలో వివిధ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి, ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, కన్వీనర్. జెఆర్‌జి పట్నాయక్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.చిన్నారావు పాల్గొన్నారు

ఆనందపురం : స్థానిక ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం బి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యజీవితంలో భాగమైన గణితంలో మెలకువలను నేర్చుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు గణితంలో వివిధ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.టీచర్లు కె.జయ, కెవిఆర్ పట్నాయక్, సత్యనారాయణ, భాస్కరరావు, పిఇటి ప్రసాద్ పాల్గొన్నారు

గీతంలో...

మధురవాడ : భారతీయ గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఐఐటి ముంబై గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ కె.ఎస్.మల్లికార్జునరావు హజరై గణిత శాస్త్ర ప్రాధాన్యతను, వివిధ రంగాలలో గణిత శాస్త్ర ఉపయోగాలను వివరించారు.. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, గణిత శాస్త్ర విభాగాధిపతి, సదస్సు కన్వీనర్‌లు డాక్టర్ వి.శిరీష, కోఆర్డినేటర్ ఎమ్‌విఆర్.కామేశ్వరి, మాట్లాడారు

గాజువాక: పాత గాజువాక, చైతన్యనగర్‌లోని చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలో జాతీయ గణిత దినోత్సవం, శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాలేజీ కరస్పాండెంట్ జి.విజయలక్ష్మి, డైరెక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ, గణితం ప్రాముఖ్యత, విశిష్టతను విద్యార్థులకు వివరించారు. వేడుకలో భాగంగా విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, రంగోలి వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. హెచ్ఒడిజోగరావు, అధ్యాపకులు శైలజ, సంతోషిణి, ప్రసన్న, గౌతమి పాల్గొన్నారు.

అనకాపల్లి: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతిని మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డివైఇఒ పి.అప్పారావు పాల్గొని విద్యార్థులు తయారు చేసిన గణిత ప్రాజెక్టులను చూసి ప్రశంసించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయులు బాబు, శైలజ, సుబ్బారావు, దయాసాగర్, ఉపాధ్యాయులు గొంది చినబ్బాయ్, వసంతరావ్, లక్ష్మి, అనీరోజ్, సుబ్రహ్మణ్యం, గౌరి, రమణమ్మ, ఉమా, స్వామి, బాల, నారాయణరావు, కామేశ్వరరావు, శేషు, జగదీశ్వరి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి హెచ్‌ఎం కె.సత్యారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పలు గణిత ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఎంఇఒ బికెయస్.విశ్వేశ్వరరావు, గణిత ఉపాధ్యాయులు అచ్చంనాయుడు, విజయకుమార్, శివజ్యోతి, వెంకట్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. గణితం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం, మహిళా డైరెక్టర్ నూర్జహాన్, ఉపాధ్యాయులు సుమతి, పద్మిని, మహాలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

దేవరాపల్లి : కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన గణితంపై వ్యాసరచన, వక్తృత్వ, బోధనోపకరణాల తయారీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం పిబిటి సుందరి, ఉపాధ్యాయులు రాము, సుజాత, మాధవి, పూర్ణిమ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం హైస్కూల్లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి హెచ్‌ఎం ఎస్.రవి పూలమాలవేసి నివాళులర్పించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు హైమావతి, పట్నాయక్, జగదీష్, వెంకటేశ్వర్లు, భాషా నూర్నిషా, ఫిజికల్ డైరెక్టర్ రాజు, మాధురి , కే సరస్వతి పాల్గొన్నారు.

రావికమతం: మండలంలోని మేడివాడ హైస్కూల్లో జాతీయ గణిత దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెండు యాప్‌లను, 28 రకాల ప్రాజెక్టులను టెన్త్ విద్యార్థులు రూపొందించారు. ప్రధానోపాధ్యాయులు వి.రామారావు, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, పద్మావతి పాల్గొన్నారు.

పాయకరావుపేట:స్థానిక శ్రీచైతన్య స్కూలులో రామానుజన్ జయంతిని నిర్వహించారు. స్కూలు ఏ.జి.యమ్ సురేష్, ఆర్ఐ గోపీనాధ్, ప్రిన్సిపల్ మాణిక్యాలరావు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎజిఎం.సురేష్, అకడమిక్ కో ఆర్డినేటర్ వెంకట రమణ, ఏవో విజయ్ పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదబోదిగల్లం హైస్కూల్లో రామానుజన్ జయంతి పురస్కరించుకొని నిర్వహించిన గణిత ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎంలు జి.నారాయణరావు, గణిత ఉపాధ్యాయులు భ్రమరాంబ దేవి, ఫరీదాబేగం ,డివిఎస్ రావు, కుమారి, సుధాకర్, ఎన్‌విఎస్ ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, రమేష్ బాబు , శ్రీదేవి పాల్గొన్నారు.

యస్ రాయవరం: మండలంలోని లింగరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని హెచ్‌ఎం స్వప్న ప్రియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కోన నాగేశ్వరరావు, యలమంచిలి డివైఇఒ పి.అప్పారావు, ఎంఇఒ ఏఎన్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. ధర్మవరం అగ్రహారం హెచ్‌ఎం రమణారావు రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మ్యాథ్స్ ప్రాజెక్ట్స్ చేయించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అప్పలరాజు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో బోని గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లోడగలవానిపాలెం గ్రామపంచాయతీకి చెందిన పిన్నింటి అప్పలరాజు (30) మృతిచెందాడు. విశాఖ జీవీఎంసీలో వాటర్ సప్లైలో విధులు నిర్వహిస్తున్న అప్పలరాజు, శుక్రవారం రాత్రి బోని వైపు వెళ్తుండగా ట్రాక్టర్‌ను ఢీకొని ప్రమాదానికి గురై అక్కడికక్కడికే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న సురేష్ చిన్న గాయాలతో బయటపడ్డాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంచార జాతులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : కలిగొట్ల భాస్కరరావు వర్ధంతి సందర్భంగా భీమిలి కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన వలందపేటలో రోడ్డుపక్కన, గుడారాల్లో నివసిస్తున్న పలువురు సంచార జాతులకు చెందిన వ్యక్తులకు గురువారం రాత్రి దుప్పట్లు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన ఆరో వార్డు అధ్యక్షునిగా సంతోష్ నాయుడు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : జివిఎంసి ఆరో వార్డు పిఎం.పాలేనికి చెందిన జనసేన నాయకులు జి సంతోష్‌నాయుడును ఆ పార్టీ ఆరో వార్డు అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంతోష్‌నాయుడు మాట్లాడుతూ జనసేన ఆరో వార్డు అధ్యక్షుడిగా బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పంచకర్ల సందీప్‌లకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని, రాబోయే ఎన్నికల్లో జనసేన విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాగా సంతోష్‌నాయుడుకు ఆరోవార్డు పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

88వ వార్డుకు శీకాంత్

గోపాలపట్నం : జనసేన 88వ వార్డు అధ్యక్షుడిగా పెద నరవ గ్రామానికి చెందిన వబ్బిన జనార్ధన్ శ్రీకాంత్‌ను ఆపార్టీ నియమించింది. తనపై నమ్మకంతో వార్డు అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన అధినేత పవన్‌కల్యాణ్, విశాఖపట్నం అర్బన్ సమన్వయకర్త కోన తాతారావు, ఉమ్మడి విశాఖపట్నం రూరల్ అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబులకు ధన్యవాదాలు తెలిపాడు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -ఆనందపురం: అనందపురం పంచాయతీ బుడగ జంగాలకాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి చర్యలు చేపట్టారు. కొన్నాళ్లుగా మోటారు మరమ్మతులకు గురికావడంతో నీటి సమస్య తలెత్తగా, పంచాయతీ నిధులు రూ35వేలతో 2హెచ్‌పి కొత్త మోటారు, ప్యానెల్ బోర్డు, కేబుల్ వైరు ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. నీటి సమస్య పరిష్కారంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసి, ధన్యవాదాలు తెలిపారు.

సౌత్ జోన్ చెస్ పోటీలకు గీతం మహిళల జట్టు

మహిళా చెస్ జట్టుతో గీతం యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : చెన్నైలోని డాక్టర్ ఆంబేద్కర్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు జరగనున్న దక్షిణాది రాష్ట్రాల (సౌత్‌జోన్) విశ్వవిద్యాలయాల మధ్య జరిగే చదరంగం పోటీలలో పాల్గొనే గీతం విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు క్రీడా విభాగం డైరక్టర్ డాక్టర్ యు.విజయకుమార్ తెలిపారు. జట్టు మేనేజర్‌గా డాక్టర్ పి.విజయలక్ష్మి వ్యవహరిస్తారని, గీతం జట్టుకు కె.సాత్విక, ఎస్.ప్రియ, డి.శ్యామల జోషి, బి.సాయిశ్రేయనాయుడు, కె.భవ్యశ్రీ, ఎమ్ఆర్.ఇంచారా ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. గీతం జట్టుకు ముందస్తు శిక్షణ ఇచ్చినట్లు క్రీడావిభాగం డిప్యూటీ డైరక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

ఉచిత ఉపకరణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- సీతమ్మధార : వికలాంగులకు ఉచిత ఉపకరణాల మంజూరుకు అర్హులైన వారి ఎంపికకు దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. శుక్రవారం టిపిటి కాలనీ ఎన్ఎంటి హైస్కూల్ ఆవరణలో చేపట్టిన కార్యక్రమంలో పలువురు వికలాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలీమ్‌కో, జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో వికలాంగులకు ఉచిత ఉపకరణాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్యక్రమ కోఆర్డినేటర్ రూపాకుల రవికుమార్, ప్రభుత్వ వయోవృద్ధులు వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు జె మాధవి, జివిఎంసి మూడో జోన్ కమిషనర్ విజయలక్ష్మి అలిమ్‌కో ప్రతినిధి శ్వేత, ఎపిడి దుర్గాప్రసాద్, అరుణ్‌కుమార్, జామి శ్రీనివాస్, ఉమా శంకర్ పాల్గొన్నారు

బర్రెలక్క స్ఫూర్తితో అసెంబ్లీ ఎన్నికల బరిలోకి...

స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ : నాగమణి

సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగమణి

ప్రజాశక్తి -భీమునిపట్నం : త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా మధురవాడకు చెందిన నాగోతి నాగమణి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసిన కె శిరీష అలియాస్ బర్రె లక్క స్ఫూర్తితో తాను పోటీబరిలో నిలవాలనుకున్నట్లు వెల్లడించారు. స్థానిక ప్రజల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. వేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించిన చిట్టివలస జ్యూట్ మిల్లు మూతబడడం బాధాకరమన్నారు. బాల్యం, విద్య, వివాహం అన్నీ తగరపువలసలోనేనని, కొంతకాలంగా అనిట్స్, అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగం చేసిన తాను ప్రస్తుతం, బోయిపాలెంలోని వైజాగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రొఫెషనల్ స్టడీస్ (విప్స్)లో ఎంబి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నట్లు వివరించారు.

శ్రామిక జెండా తొలగించిన వారిపై కఠినచర్యలు

37వ సచివాలయ ప్లానింగ్ సిబ్బంది నిర్వాకంపై సిఐటియు ధర్నా

ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు, భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి- పిఎం.పాలెం : జివిఎంసి ఐదోవార్డు సాయిరామ్ కాలనీ, కొమ్మాది బస్‌స్టాప్ వెనుక ఎస్‌టిబిఎల్ థియేటర్ సమీపంలో శ్రీకృష్ణ భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటుచేసిన సిఐటియు జెండా, సంఘం బోర్డు తొలగింపును నిరసిస్తూ శుక్రవారం సిఐటియు మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సంబంధిత సచివాలయం వద్ద బైఠాయించి, ధర్నా నిర్వహించారు. శ్రామికుల జెండాను, బోర్డును తొలగించిన సచివాలయ ప్లానింగ్ సిబ్బంది, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయ ప్రణాళికా సిబ్బంది తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ మధురవాడ ప్రాంత సాయిరాం కాలనీ, మరికొన్ని కాలనీల్లోని భవన నిర్మాణ కార్మికులంతా సిఐటియుకు అనుబంధంగా శ్రీకృష్ణ భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. సాయిరాం కాలనీలో చెత్తాచెదారం, దుర్గంధం నిండిన ప్రాంతాన్ని శుభ్రపరిచి, సిఐటియు జెండాను, సంఘం బోర్డును ఏర్పాటు చేస్తే, కనీసం సమాచారమివ్వకుండా వాటిని తొలగించడమే కాకుండా, జెండా స్తంభాన్ని విరగ్గొట్టడం దుర్మార్గమన్నారు. 37వ సచివాలయ పరిధిలో ఎక్కడికక్కడే వందలాదిగా రాజకీయ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు ఉంటే వాటి జోలికిపోని సచివాలయ సిబ్బంది, సిఐటియు జెండా, బోర్డును తొలగించడం కార్మికుల పట్ల చిన్నచూపు, నిర్లక్ష్యానికి నిదర్శనమేనన్నారు. బాధ్యులపై తక్షణ చర్యలు చేపట్టడంతోపాటు, తొలగించిన జెండా, బోర్డులను తీసేసిన వారితోనే పునరుద్ధరించే చర్యలు చేపట్టకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎ.లక్ష్మణరావు, సిఐటియు నేతలు, కార్యకర్తలు జి.చిన్నారావు, జి.కిరణ్, పి లక్ష్మణరావు, ఎ.సతీబాబు, కె.రమణ, ఎం కంచయ్య, ఎ.నారాయణరావు, డి.అప్పలరాజు పాల్గొన్నారు.

'కళింగ కమ్యూనిటీ'కి సంబంధం లేదు!

-24న సర్వసభ్య సమావేశం ప్రకటనపై ఖండన

మాట్లాడుతున్న కళింగ కమ్యూనిటీ నేతలు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఈ నెల 24న ఆదివారం ఉదయం పదిగంటలకు గోపాలపట్నం పెట్రోల్ బంక్ దరి కుమారి కళ్యాణ మండపంలో ఖారవేల ఎడ్యుకేషనల్, కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ (వైజాగ్‌సిటీ కళింగ కమ్యూనిటీ) జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ పేరుతో కొందరు చేసిన ప్రకటనతోపాటు పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారానికి అసలు కమిటీకి ఎటువంటి సంబంధం లేదని కళింగ కమ్యూనిటీ అసోసియేషన్ కార్యనిర్వాహక నేతలు ఖండించారు. ఈమేరకు శుక్రవారం కళింగ కమ్యూనిటీ అసోసియేషన్ నేతలు అధ్యక్షుడు పివి.రమణమూర్తి, పూర్వ అధ్యక్షుడు పప్పల కృష్ణమూర్తి, కార్యదర్శి మొదలవలస కృష్ణారావు, ఉపాధ్యక్షుడు ముద్దాపు నరసింహం మాట్లాడుతూ, సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహిస్తామంటూ ప్రకటన చేస్తున్నారని, దానిని ఖారవేల ఎడ్యుకేషనల్ కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎటువంటి సంబంధం లేదని కార్యనిర్వాహక సభ్యులు స్పష్టం చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

మాట్లాడుతున్న డైరెక్టర్

ప్రజాశక్తి -గాజువాక :గాజువాక ఆటోనగర్‌లోని సెయింట్ అలోసియస్ ఐటిఐలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. . కేక్‌ను కట్ చేసి ఆనందోత్సవాల మధ్య క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు విద్యార్థుల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కిడ్స్ అలరించాయి. సిబ్బందికి ఐటిఐ యాజమాన్యం బహుమతులు అందజేసింది. కార్యక్రమానికి ప్రిన్సిపల్ జోసెఫ్ ఫాదర్, అసిస్టెంట్ ప్రిన్సిపల్ ప్రదీప్, డైరెక్టర్ మేథ్యూ పాల్గొని క్రిస్మస్ విశిష్టతను వివరించారు. స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్

ప్రజాశక్తి- మాధవధార : జివిఎంసి 51వ వార్డు మాధవస్వామి కళ్యాణమండపంలో స్థానిక కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో ఏపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ పథకాల వివరాలతోకూడిన బోర్డును, అలాగే వైసిపి జెండాను కార్పొరేటర్ వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో, పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సిఎం జగన్‌దేనన్నారు. మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఇ ఉదయ్‌భాస్కర్, జెసిఎస్ మండల కన్వీనర్ పైడి కృష్ణారావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, పైడి ప్రతాప్, బి తిరుమలరావు, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, పొన్నాడ అప్పారావు, లత, రత్నం, కళింగనగర్ సంక్షేమ లబ్దిదారులు పాల్గొన్నారు.

సిఎంఆర్ సెంట్రల్‌లో 'రంగీత' ఫ్యాషన్ స్టోర్

ఫ్యాషన్ అవుట్‌లెట్‌ను ప్రారంభించిన నటి మేఘనా లోకేష్

'రంగీత' అవుట్‌లెట్ ప్రారంభోత్సవంలో నటి మేఘనా లోకేష్

ప్రజాశక్తి -గాజువాక. : విశాఖపట్నంలోని గాజువాక సిఎంఆర్ సెంట్రల్‌లో స్సెల్లార్ బ్రాండ్స్‌కు చెందిన ప్రముఖ డైరెక్ట్-టు-కన్స్యూమర్, భారతీయ ఫ్యాషన్ బ్రాండ్ 'రంగీత' తన మొదటి ప్రత్యేకమైన బ్రాండ్ అవుట్‌లెట్‌ను శుక్రవారం ప్రారంభించింది. నటి మేఘనా లోకేష్ పాల్గొని అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్సెల్లార్ బ్రాండ్స్ సిఇఒ హిమాన్షు చక్రవర్తి మాట్లాడుతూ, మార్కెట్ ఫ్యాషన్ అవసరాలను సమగ్రంగా తీర్చాలనే తమ లక్ష్యానికి అనుగుణంగా విశాఖపట్నంలో తమ స్టోర్‌ను ప్రారంభించామన్నారు. కస్టమర్-సెంట్రిక్, ఈ విస్తరణ, మల్టీ ఛానెల్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడం తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు ప్రతి వినియోగదారునికి పరిపూర్ణమైన స్టైల్‌ను పొందేందుకు తమ స్టోర్ వేదిక కానుందని, కస్టమర్ల అభిమానాన్ని చూరగొంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్‌బికెను సందర్శించిన వియత్నాం బృందం

చిరుధాన్యాల సాగును పరిశీలిస్తున్న వియత్నాం బృందం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని వేములవలస రైతుభరోసా కేంద్రాన్ని వియత్నాం ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. ప్రకృతి వ్యవసాయం విధానంలో చిరుధాన్యాల సాగు, పొలంబడి నమూనాలను ప్రదర్శించగా వాటిని తిలకించారు. ఈ సందర్భంగా వియత్నాం ప్రతినిధుల బృందానికి వ్యవసాయశాఖ అధికారులు దీనిపై వివరించారు. అమరావతి నుంచి వచ్చిన వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు శ్రీధర్, ఉప సంచాలకులు వేంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మన్మధరావు, వెటర్నరీ డిడి డాక్టర్ కరుణాకర్, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.మోహన్‌రావు, వ్యవసాయశాఖ ఎడి డాక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ సిహెచ్ సుబ్రమణ్యం, మండల వ్యవసాయ అధికారులు. సిహెచ్ సంధ్య రత్నప్రభ, బి.శివకోమలి, ఎవిఎస్.చలం, వేములవలస అగ్రికల్చర్ అసిస్టెంట్ షేక్ అహ్మద్‌గౌస్, మండల వ్యవసాయ సలహామండలి సభ్యులు కోరాడ రాంబాబు పాల్గొన్నారు .

ఘనంగా వి జ్యూయలరీ మార్ట్ ప్రారంభం

ప్రారంభిస్తున్న సురేష్ కుమార్ జైన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:విశాఖ నగరంలోని హోటల్ మేఘాలయ పక్కన ఉన్న నవరత్న ట్రేడ్ సెంటర్ ఆరో అంతస్తులో వి జ్యూయలరీ మార్ట్‌ను నవరత్న ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ కుమార్ జైన్ శుక్రవారం ప్రారంభించారు. వైశ్య జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ వైశ్యరాజు పాల్గొన రాజు జ్యోతి ప్రజ్వలన చేయగా నవరత్న ఎస్టేట్స్ డైరెక్టర్ మంచుకొండ శ్యామజవేరి జ్యూయలర్స్ అధినేత మంచుకొండ శ్యామ్ మొదటి కొనుగోలు చేశారు. అనంతరం వి జ్యూయలరీ మార్ట్ బ్రాంచ్ మేనేజర్ సయ్యద్ ఖాదర్ మాట్లాడుతూ మార్కెట్ ధరల కన్నా అతి తక్కువ ధరలకు బంగారు ఆభరణాలను అందించడమే కాకుండా వివిఎస్ క్లారిటీ ఇఎఫ్ కలర్‌గల డైమండ్స్ క్యారెట్ రూ.49,900 నుంచి ప్రారంభమవు తుందని తెలిపారు. వాటిపై తరుగు, మజూరీ లేదని, జిఎస్‌టిని కూడా కస్టమర్లు తరఫున తామే చెల్లిస్తామని ఆయన తెలిపారు. అలాగే రెగ్యులర్ వెండి వస్తువులపై కూడా తరుగు, మజూరీ లేదని, జిఎస్‌టినీ తామే చెల్లిస్తామని తెలిపారు. అత్యుత్తమ డిజైనర్ ఆభరణాలను ఫ్యాక్టరీ ధరలకు అందిస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

సిజిఎంకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కు కాంట్రాక్టు కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు కోరారు. శుక్రవారం సిజిఎం (హెచ్‌ఆర్)గాంధీకి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా కాంట్రాక్టు లేబర్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ. ఉక్కు యాజమాన్యం చొరవ తీసుకుని కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్టీల్ ఉత్పత్తి, ప్లాంట్ నిర్వహణలో రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కీలకంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. రానున్న పండుగలను దృష్టిలో పెట్టుకుని, యాజమాన్యం స్పందించి తక్షణమే వేతనాలను చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు. జి శ్రీనివాసరావు, చట్టి నర్సింగరావు, వంశీ, నాగరాజు, సత్యారావు, సిహెచ్ రమణ పాల్గొన్నారు

స్కూల్ గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్స్ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు

విజేతలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈనెల 19 నుంచి 21వరకు విశాఖలో నిర్వహించిన ఖోఖో, బాడ్మింటన్, ట్రిపుల్ జంప్, బ్రాడ్ జంప్, హైజంప్‌లో మొదటి స్థానం, వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో, హైజంప్‌లో మూడో స్థానం, 100 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో, షార్ట్‌పుట్‌లో నాలుగోస్థానంలో నిలవడం ద్వారా తమ కళాశాల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ మురళీకృష్ణ,తెలిపారు. శుక్రవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు

13వ వార్డులో ఎంవివి పాదయాత్ర

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంవివి

ప్రజాశక్తి - ఆరిలోవ : గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విశాఖ ఎంపి, వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవివి .సత్యనారాయణ శుక్రవారం వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఆరిలోవ కాలనీ, శ్రీకాంతనగర్, లక్ష్మీనగర్, గణేష్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలను అడుగుతూ, సంక్షేమ పథకాలను వివరిస్తూ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు, ఫారెస్టు డైరెక్టర్ ఒనం వరలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న

బిజెపిని చిత్తుగా ఓడించండి

ఇండియా వేదిక ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లిల్లో నిరసనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపిని, దానికి మద్దతుగా నిలిచే పార్టీలను రాబోయే ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించాలని ఇండియా వేదిక నాయకులు పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వ నిరంకుశత్వం, 146 మంది ఎంపీల సస్పెన్షన్, ప్రజాస్వామ్యంపై దాడిని ఖండిస్తూ వేదిక ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కాంగ్రెస్ నగర కార్యదర్శి గొంప గోవిందరాజు, ఆప్ రాష్ట్ర మహిళ కన్వీనర్ డాక్టర్ సీతల్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విపక్ష పార్టీలకు చెందిన 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేసిందని దుయ్యబట్టారు. ఈ నెల 13న పార్లమెంటులో ఇద్దరు ఆగంతుకులు ప్రవేశించి కెమికల్ కేన్లతో పొగదాడి చేశారని, ఎంపీలను భయభ్రాంతులకు గురిచేశారని, వారికి పార్లమెంటులో ప్రవేశానికి పాసులు ఇచ్చింది మైసూరు బిజెపి ఎంపీనని తెలిపారు. దీనిపై ఉభయ సభల్లో హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని, చర్చలు చేపట్టాలని విపక్ష ఎంపీలు పట్టుబడితే దీన్ని తిరస్కరించి ఎంపీలను సస్పెండ్ చేయడం భారత ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని తెలిపారు. పార్లమెంటుకే రక్షణ కల్పించలేని మోడీ ప్రభుత్వం ప్రజలను, దేశాన్ని ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. విపక్ష సభ్యులను మూకుమ్మడిగా సస్పెండ్ చేసి పార్లమెంటులో విపక్షం లేకుండా ప్రజా వ్యతిరేక బిల్లులను బిజెపి ప్రభుత్వం పాస్ చేసుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, సిపిఐ నాయకులు ఎ.విమల, వై.రాంబాబు, సిపిఎం నాయకులు వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, కాంగ్రెస్ నాయకులు చోడదాసి సుధాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : భారత పార్లమెంట్లో విపక్ష పార్లమెంట్ సభ్యులపై సస్పెన్షన్ వేటు వేసి మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని వామపక్ష, ఇండియా కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఇండియా వేదిక పిలుపుమేరకు అనకాపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నిలువుటద్దంగా ఉన్న పార్లమెంట్లో కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తన వైఫల్యాలను ప్రశ్నించిన విపక్ష పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేసిందని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్‌రావు మాట్లాడుతూ బిజెపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, వాటిని ప్రశ్నించిన వారిని క్రూరంగా అణచివేసే విధానాలతో బిజెపి పాలన కొనసాగుతుందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.వెంకటరమణ మాట్లాడుతూ బిజెపి తన విధానాల ద్వారా దేశంలో ఉన్న బడుగు బలహీన వర్గాలను, రైతులను, రైతు కూలీలను అణచివేస్తుందని విమర్శించారు. పిసిసి ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇంత మంది ఎంపీలను ఎప్పుడూ బహిష్కరించలేదన్నారు. దీనిపై రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు మౌనంగా ఉండడం వారి రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై.ఎన్ భద్రం, రాజాన దొరబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఐ.ఆర్. గంగాధర్, దాసరి సంతోష్, కాళ్ళ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ధర్నా చేస్తున్న ఇండియా వేదిక పార్టీల నాయకులు, కార్యకర్తలు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు జాతీయంగా మార్కెటింగ్ చేసుకునే సదుపాయం ఉందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్ లచ్చన్న తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో శుక్ర శనివారాల్లో రెండు రోజులపాటు పిజిఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికెట్‌పై శిక్షణ కార్యక్రమానికి సిఎస్ఎ ట్రైనర్ వి.అనుష పాల్గొన్నారు. ఈ శిక్షణకి 24 మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హాజరయ్యారు. ఈ సర్టిఫికెట్లు 3 ర్యాంకులుగా నేషనల్ ప్రోగ్రాం ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్, నేషనల్ ఆర్గానిక్ ప్రోగ్రాం స్టాండర్డ్స్, పార్టిసిపేషన్ గ్యారంటీ సిస్టంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈజీఎస్ సర్టిఫికెట్ చేయుటకు గ్రామ స్థాయిలో లోకల్‌గా 5 నుండి 15 మంది వరకు చిన్న చిన్నగ్రూప్‌లు చేసుకోవాలని వివరించారు. వీటి ద్వారా ఈ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే కూరగాయలు, ఆకుకూరలు, బెల్లం, నూనెలను, బియ్యంను జాతీయంగా మార్కెటింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. జిల్లా మార్కెటింగ్ ఎస్ఎఫ్ఎ వర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది.

కుల వృత్తుల వారికి వైసిపి ప్రభుత్వం అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : నిరుపేద వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే ఉద్దేశంతో ఏర్పాటైన కుల వృత్తుల కార్పొరేషన్లకు బడ్జెట్లో కేటాయించిన నిధులను వైసిపి ప్రభుత్వం దారి మళ్లించి బీసీ, ఎస్సీ, ఎస్టీ కులవృత్తుల వారికి అన్యాయం చేసిందని టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరత్న పథకాల నిధులనే కార్పొరేషన్ నిధులుగా చూపిస్తూ అంకెలు గారడి చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ ద్వారా ఏ సామాజిక వర్గానికి ఉపాధి అందడం లేదన్నారు. వైసిపి కార్యకర్తలకు ఉపాధి కల్పించారే తప్ప ఈ సామాజిక వర్గానికి న్యాయం చేయలేదని మండిపడ్డారు. జగన్ అధికారంలోకి వచ్చాక సామాజిక భద్రత పింఛన్లు, ఉపకార వేతనాలు, చేయూత, వాహన మిత్ర, చేదోడు, నేతన్న నేస్తం, ఆసరా తదితర పథకాలకు బడ్జెట్లో కేటాయించిన నిధులనే కార్పొరేషన్ పద్దుల్లో చూపిస్తున్నారని, వాటినే కార్పొరేషన్లలో మళ్లీ లెక్కలు చూపిస్తున్నారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ నారాయణరావు, మాదంశెట్టి నీలబాబు, కోట్ని రామకృష్ణ, మళ్ల శివన్నారాయణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సంచుల ముద్రణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా ఫోల్డర్స్, సంచుల ముద్రణ నిమిత్తం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు దరఖాస్తులను Anakapalli.ap.gov.in వెబ్‌సైటు నుండి ఈ నెల 23 నుండి 28వ తేదీ వరకు డౌన్లోడ్ చేసుకోవచ్చని, అదే రోజుల్లో కార్యాలయ పని దినాలలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల లోపు పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, అనకాపల్లి వారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. దరఖాస్తులు సమర్పించుటకు ఆఖరు తేది ఈ నెల 28 అని, మరింత సమాచారం కొరకు ఎన్‌హెచ్ఎం, డిపిఎం యూనిట్, డిఎంహెచ్ఓ వారిని సంప్రదించాలని తెలిపారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

న్యాయవాదుల నిరసన కార్యక్రమంలో సిపిఎం నేత లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. భూ యాజమాన్య హక్కు చట్టాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు అనకాపల్లిలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి మూడో రోజు చేరాయి. ఈ దీక్షలను లోకనాథం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27/2023 భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల పేద, మధ్య తరగతి రైతులకు తీవ్ర అన్యాయం జరగనుందని పేర్కొన్నారు. న్యాయవాదులు సాయి లక్ష్మణ్, బంధం రమణ, మోహన్, గోవింద్, శరత్, మల్లేశ్వరరావు శుక్రవారం నాటి రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్నారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసాల సుబ్బన్న, కోటేశ్వరరావు, ఐఆర్ గంగాధర్, సిపిఐ నాయకులు వైఎన్.భద్రం, జనసేన నాయకురాలు కళావతి, బీఎస్పీ నాయకులు ఎస్‌వివి రామచంద్రరావు తదితరులు మద్దతు తెలియజేశారు.

చోడవరం : ఏపీ ప్రభుత్వ తీసుకొచ్చి భూహక్కు చట్టం ప్రజల పాలిట శాపంగా మారనుందని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ చోడవరం కోర్టు వద్ద న్యాయవాదులు చేస్తున్న రెండవ రోజు దీక్షల్లో రాజు పాల్గొని సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భూహక్కులను హరించడానికి జగన్మోహన్ రెడ్డి కుట్ర పన్ని ఈ చట్టాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మల్లునాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల డేవిడ్, కృష్ణవేణి, న్యాయవాదులు అల్లు గిరిధర్, లక్ష్మీనారాయణ జిపి సత్యనారాయణ, బి.రాజు, డీజే ప్రకాష్‌రావు డిపివిఆర్ సాంబమూర్తి, వివిఎస్ మూర్తి, ఎం శ్రీనివాసరావు, ఎస్ వరలక్ష్మి, డి సత్యవతి, బి గౌరీదేవి, కొల్లి శ్రీను పాల్గొన్నారు.

అనకాపల్లిలో న్యాయవాదుల దీక్షల్లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

జాతీయ రైతు దినోత్సవ సందర్భంగా మండలంలోని సీతయ్యపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో కరక గ్రామంలో శుక్రవారం వ్యవసాయ రుణాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా రైతులకు ఉపయోగపడే రుణాలు గురించి వివరించారు. గ్రామంలో ఎవరికైనా ఏ విధమైన రుణాలు కావాలన్నా బ్యాంకు వద్దకు వచ్చి సంప్రదించాలన్నారు. గ్రామంలోని ముగ్గురు రైతులకు రైతు దినోత్సవం సందర్భంగా సాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, గ్రామ సర్పంచ్ వై.చిన సత్యారావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ వై.నాయుడు, వై.శ్రీను పాల్గొన్నారు.

అడ్డగోలుగా విద్యుత్ బిల్లులు పెంపుపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ బిల్లులు ఇష్టారాజ్యంగా పెంచేసి ప్రజలను నట్టేట ముంచేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ జంక్షన్‌లో శుక్రవారం ధర్నా చేపట్టారు. జగన్ నాలుగేళ్ళ పాలనలో ఎనిమిది సార్లు కరెంట్ చార్జీలు పెంచారని, గతంలో కన్నా రెండు నుంచి మూడు రెట్లు చార్జీలు పెంచడంతో ప్రజల జేబులకు బిల్లులు పడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ద్వారపూడి పరమేశ్వరరావు, ఈర్లె శ్రీరామమూర్తి, కర్రి రామకృష్ణ, చదరం నాగేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి దోహదపడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక బొజ్జన్న కొండనును బెంగుళూరు జాతీయ మహాబోధి సొసైటీ బౌద్ధ బిక్షువులు 40 మంది శుక్రవారం సందర్శించారు. విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కొండపై ప్రధాన గుహలో బుద్ధ స్థూపం, చైత్యముల వద్ద బుద్ధునికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. బుద్ధుని శాంతి, అహింస, కరుణ, ధర్మాలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రపంచ శాంతికి దోహద పడాలని ఉద్భోదించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ మాటూరి శ్రీనివాస్, కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం బల్లా నాగభూష ణమ్, పెయ్యల సిద్ధార్థ, రావూరి విజయ కుమార్, బత్తుల గౌతమ్, నేలపూడి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో వివిధ వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఔట్సోర్సింగ్ సిబ్బందిని నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9949877480 నెంబర్ను సంప్రదించాలన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తగరంపూడి గ్రామ సచివాలయంలో కొత్తగా ప్రభుత్వం విడుదల చేస్తున్న ఆరోగ్య కార్డులను పంపిణీ ఎంపిపి గొర్లి సూరిబాబు చేతుల మీదుగా శు క్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి అయిత అనంద రాము, సర్పంచ్ యాదిగిరి అప్పారావు, ఎంపీడీవో కే నరసింహారావు, తగరంపూడి వైద్యాధికారి డాక్టర్ పావని, గ్రామ కార్యదర్శులు వెంకటేష్, ఎస్తేరు, లబ్ధిదారులు, ఆశావర్కర్లు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి టెన్నికాయిట్ పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల 41వ స్త్రీ పురుషుల టెన్నికాయిట్ పోటీలు ఈ నెల 28 నుండి 30 వరకు శ్రీకాకుళం జిల్లా, పాతపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని ఏపీ టెన్నికాయిట్ అధ్యక్ష కార్యదర్శులు వైడి రామారావు కెవిఎస్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వయో పరిమితి లేదని, ప్రతిభ ఆధారంగా ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు.

రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-చోడవరం

నియోజకవర్గంలో మూడు మండలాల పరిధిలో రోడ్ల నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయల ఎన్డీబీ ఎస్ నిధులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తెలిపారు. బుచ్చయ్యపేట మండలం ఇదంపూడి, పి భీమవరం పంచాయతీ గొల్లపాలెం రోడ్డు, రావికమతం మండలం నాగన్నపాలెం రోడ్డు, మర్రి వలస గొల్లలపాలెం రోడ్డు, గుడివాడ మట్టవానిపాలెం రోడ్డుకు ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు. వీటి నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్ఏలు నిరసన

ప్రజాశక్తి- సబ్బవరం : విఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని విఆర్ఏలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల విఆర్ఏల సంఘం అధ్యక్షుడు ఎన్.గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్ర విఆర్ఏల సంఘం పిలుపు మేరకు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశామన్నారు. ఈ నెల 28న జిల్లాలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అప్పటికి ప్రభుత్వం స్పందించపోతే జనవరి 5న విజయవాడలో సీసీఎల్ఏ ముట్టడి చేసి సమ్మెలో పాల్గొంటామని స్పష్టం చేశారు. విఆర్ఏలు బి.శ్రీనివాస్, ముదపాక అప్పారావు, బి.శంకర్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక పోలీస్ స్టేషన్‌ను అనకాపల్లి డిఎస్‌పి వి.సుబ్బరాజు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను తనిఖీ చేశారు. ఈ ఏడాదిలో పోలీస్ స్టేషన్లో ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఎన్ని కేసులు పరిష్కరించబడ్డాయి, ఏడాదిలో ఎన్ని మిస్సింగ్ కేసులు నమోదయ్యాయో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు జరగకుండా రాత్రులు గస్తీ నిర్వహించాలని సూచించారు. ఏడాది క్రైమ్ రేట్లు తగ్గాయని, ఇంకా తగ్గే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కాబట్టి బైండోవర్లు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిఐ కుమారస్వామి, ఎస్సై ధనుంజయ్ పాల్గొన్నారు.

నేడు వడ్డాది వెంకన్న ఉత్తర ద్వార దర్శనం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల 23న శనివారం తెల్లవారుజామున భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక బి ఎన్ రోడ్లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆర్చ్ నుండి కొండ చుట్టూ స్వామి చిత్రపటాలతో గోవింద నామాలతో గిరి ప్రదక్షిణ చేయుచున్నారు. ప్రత్యేక వైకుంఠ ఏకాదశి భక్తులు ఇక్కడ గిరి ప్రదక్షిణ చేస్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తరద్వారా దర్శనం కల్పించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో శర్మ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాటు చేశారు.

కశింకోట : ముక్కోటి ఏకాదశి సందర్భంగా కసంకోటలోని ధ్యాన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయతలు స్థాపకులు శ్రీ రేజేటి రేమానుజాచార్యులు మారుతి ఏర్పాట్లు శుక్రవారం పర్యవేక్షించారు. భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు ప్రజలు ఇచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

గ్రామాల్లో రత్నాకర్ పర్యటన

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని కొత్తపల్లి, బుచ్చయ్యపేట గ్రామాల్లో వైసిపి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల, జెడ్పీ హైస్కూల్ను సందర్శించి అక్కడ సదుపాయాలు, సమస్యలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి, లక్ష్యాన్ని నిర్ణయించుకొని, దానిని సాధించాలని సూచించారు. హైస్కూల్‌కు సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో ఆకతాయిలు పలు వస్తువులను ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు తెలియజేయగా, సెక్యూరిటీ గార్డు నియామానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హైస్కూల్ ఆవరణలో తన సొంత నిధులతో రెండు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌ను సందర్శించిన రత్నాకర్ తన సొంత నిధులతో ఆరోగ్య కేంద్రానికి రెండు సిలెన్ స్టాండ్స్, ఒక ఫ్యాన్, లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ కన్నం శ్యామ్‌సన్, బుచ్చయ్యపేట సర్పంచ్ కోన నాయుడు, ఉఊడి చినబాబు, బుదిరెడ్డి రామారావు, తిర్రి రామారావు, సీహెచ్ మురళి, మలపురెడ్డి చిరంజీవి, మాజీ సర్పంచ్ మలపురెడ్డి అప్పారావు, బద్ది చెల్లయ్యనాయుడు, దాడి కృష్ణ, వేగి పవన్‌కుమార్, యల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న వైసిపి నేత రత్నాకర్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్ నరసింగరావు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెలో భాగంగా కొప్పాక డీఈఓ కార్యాలయం వద్ద మూడవరోజు నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ దీక్ష శిబిరానికి శుక్రవారం నరసింగరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ వర్గాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పేరుతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆందోళనకు పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, యుటిఎఫ్ అచ్యుతాపురం మండల అధ్యక్షులు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె శ్రీనివాసరావు ఏపీటీఎఫ్ నాయకులు బి వెంకట్రావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ జేఏసీ నాయకులు అచ్యుత కృష్ణ, వెంకట్రావు, రామచంద్ర, వరప్రసాద్, నూకేష్, కృష్ణ, కేజీబీవీ నాయకులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలంటూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా మూడో రోజైన శుక్రవారం జీవిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ వారి పోరాటానికి మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె న్యాయ సమ్మతమైందని, వారి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రాథమిక విద్య వృద్ధి కోసం అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంతగానో కష్టపడి పనిచేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జిడిపిలో ఆరు శాతం మాత్రమే ప్రాథమిక విద్యకు కేటాయించడం సరికాదని, దీనిని రెట్టింపు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రాథమిక విద్యకు బడ్జెట్‌లో నిధులు పెంచాలన్నారు. ఆ నిధులను మిగుల్చుకోవడం కోసం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

నేడే కుంచావారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లిలో 200 సంవత్సరాల చరిత్ర కలిగిన కుంచా వారి శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం వీరభద్రరావు (అబ్బులు) శుక్రవారం తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ కుంకుమ పూజలు నిర్వహించి, ప్రజా ప్రతినిధులు, అధికారులు , భక్తులు అమ్మవారి దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారని చెప్పారు. భారీ విద్యుత్ అలంకరణ, స్టేజ్ ప్రోగ్రామ్ తో బాణాసంచ హంగామాతో మహోత్సవం అత్యంత ఘనంగా జరుగుతుందని పేర్కొన్నారు.

రథాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి దాడి

కుంచావారి గౌరీపరమేశ్వరుల నూతన రథాన్ని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు శుక్రవారం ప్రారంభించారు. శనివారం ఉత్సవం సందర్భంగా గౌరీపరమేశ్వరుల నూతన ఊరేగింపు రథాన్ని తయారు చేయించారు. నూతన రథాన్ని ప్రముఖ వ్యాపారవేత్త, కనకదుర్గ ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు దంపతులు సుమారు 10 లక్షల రూపాయల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేశారు. శ్రీకనకదుర్గ అమ్మవారి వ్యవస్థాపకులు పివి రమణ ప్రోత్సాహంతో నూతన ఊరేగింపు రథం తయారు చేయించారు. అనంతరం గౌరీ పరమేశ్వరులను దాడి వీరభద్రరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వీరభద్రరావును ఘనంగా సత్కరించి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు, గౌరవ అధ్యక్షులు పాండ్రంగి సత్యారావు, కోరుకొండ కాశీ, కోటిపల్లి జేజిబాబు, సిలపరశెట్టి బాబీ, కోరుకొండ సాంబశివరావు, పాలూరి శ్రీనివాసరావు, కొమ్మోజి రామకృష్ణ, బొండ జాడేష్, అదేపల్లి పోతురాజు, కుంచా దివాకర్, కుంచా సందీప్, కుంచా వారి కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రథాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

ధర్నా కరపత్రాలను చూపుతున్న మిడ్డేమీల్స్ కార్మికులు

5న మిడ్డేమీల్స్ కార్మికుల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలపై రానున్న జనవరి 5వ తేదీన జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపి మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మెయిన్ హైస్కూల్లో మధ్యాహ్నం భోజనం పథకం కార్మికుల సమావేశం శుక్రవారం జరిగింది. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు బిల్లులు, వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు, బిల్లులు విడుదల చేయాలని, పాఠశాలల విలీనం పేరుతో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, హైస్కూల్లో వంట చేస్తున్న కార్మికులకు వేతనాలు నిర్ణయించి అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని, మిడ్డేమీల్స్ పథకాన్ని ప్రైవేటీకరణకు ఇవ్వరాదని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని, ప్రతి పాఠశాలకు వంట గ్యాస్ స్టవ్‌లు ప్రభుత్వం సరఫరా చేయాలని తదితర డిమాండ్ల సాధనకై ఈ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్.బుచ్చిరాజమ్మ, ఎస్కె అమీనా, జి రాము, అప్పల నరసమ్మ, దేవి, మిడ్డేమీల్స్ కార్మికులు పాల్గొన్నారు.

కూలిన బ్రిడ్జి వద్ద టిడిపి, జనసేన దీక్షలు

ప్రజాశక్తి-వడ్డాది : ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లాలో ప్రధాన రహదారి బిఎన్ రోడ్డులో విజయరామరాజు పేట సమీపంలో కూలిన తాచేరు వంతెన వద్ద టిడిపి, జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు బత్తుల తాతయ్య బాబు, పివిఎస్ఎన్.రాజు ఆధ్వర్యాన శుక్రవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎన్ రోడ్డులో వంతెనలు కూలిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. పెద్దేరు వంతెన కూలి రెండేళ్లు కావస్తున్న శాశ్వత చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పుడు విజయరామరాజుపేట వంతెన కూలిపోవడంతో ప్రజలు రవాణా కష్టాలు మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిన వంతెనలు పునర్నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణం చేతకాక ఎమ్మెల్యే ధర్మశ్రీ కాంట్రాక్టర్లపై అబండాలు వేయటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి నాయకులు గూనూరు మల్లునాయుడు, డొంకిన అప్పలనాయుడు, గోకివాడ కోటేశ్వరరావు, దొండ సాయి, డిఎస్ నాయుడు, ఎడ్ల రామ్మూర్తి, తుంపాల రమేష్, టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్లు శుక్రవారం ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు బి.పడాల్ దాస్, వి.ఉషారాణి జడ్పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి ఈనెల 31 లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కే రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 60 మందిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్, ఎంవిపి కాలనీ విశాఖపట్నంలో అందజేయాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 08912564346, 94925619177 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గాలి భీమవరం ఆర్యబట్ట పాలిటెక్నిక్ కళాశాలలో ఆర్య పోలీ ఫెస్ట్ 2కె24 ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలను శ్రీరాజా ఫ్యాబ్రికేషన్ అండ్ ఇంజనీరింగ్ వర్క్స్ ఎమ్‌డి రాజా చంద్ర, డైరెక్టర్ హితిన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మూడు రోజులు పాటు జరుగుతున్న ఈ ఫెస్ట్‌లో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ నాగభూషణరావు, డైరెక్టర్ జి. సురేంద్ర కుమార్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ, రైతు బిడ్డలను వరించిన

ఎస్ఐ పోస్టులు

ఆనందంలో కుటుంబీకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం పి పొన్నవోలు గ్రామానికి చెందిన యువకులు పోలీస్ శాఖ లో ఎస్సై లు గా ఎంపికయ్యారు. బుధవారం రాత్రి రాష్ట్ర హోమ్ శాఖ అధికారులు విడుదల చేసిన ఎంపిక జాబితాలో గ్రామానికి చెందిన పులఖండం నాని, కొరసాల దుర్గా ప్రసాద్ జోన్ 1 సివిల్ ఎస్సైలుగా ఎంపికయ్యారు. సాధారణ రైతు కుటుంబాలకు చెందిన యువకులు అత్యంత ప్రతిభ కనబర్చి మూడు విభాగలలో ఉత్తీర్ణత సాధించడంతో ఎంపిక జాబితాలో చోటు చేసుకున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. యువకులు ఇద్దర్ని పలువురు అభినదించారు..

మాడుగుల: కింతలి వల్లాపురం గ్రామానికి చెందిన యువకుడు ఎస్సై పోస్ట్‌కు ఎంపికయ్యారు. మండలంలో కింతలి వల్లపురం స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన బోడ శ్రీరామ్, బోడ అప్పల నరసమ్మలు వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారు. వారి కుమారుడు బోడ నాని ఎస్సై పోస్ట్‌కు ఎంపిక కావటంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. బోడ నాని దృఢ సంకల్పంతో విజయం సాధించాడని గ్రామవాసులు రావాడ కొండబాబు, దేవుడమ్మ తెలియజేశారు.

బోడ నాని

దుర్గాప్రసాద్

పి.నాని

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ప్రజల ఆస్తి హక్కులను హరించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపి భూ హక్కు చట్టంను రద్దు చేయాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర డిమాండ్ చేశారు. నాతవరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, భూవివాదాలకు సంబంధించి రెవెన్యూ అధికారులకు ఏకపక్షంగా నిర్ణయాధికారాన్ని కట్టబెట్టేలా ఈ చట్టం ఉందన్నారు. ప్రజల స్థిరాస్థుల విషయంలో వివాదాలు ఏర్పడినప్పుడు ఆ వివాదాలను పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధి నుండి తప్పించి ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లా స్థాయి ట్రిబ్యూనల్‌కు అధికారాలు ఇవ్వడం, ట్రిబ్యూనల్ ఉత్తర్వులపై నేరుగా హైకోర్టుకు మాత్రమే అప్పీలు చేసుకునే అధికారాలు ఇచ్చారని, దీంతో సామ్యానులు ఇబ్బంది పడతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దేపల్లి గణేష్, మారిశెట్టి రాజా, రేగుబళ్ల శివ, వెంకటరమణ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఉపమాక సిద్ధం

ఆలయంలో ఏర్పాటు చేసిన పెండల్స్

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయంలో శుక్రవారం వైకుంఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాట్లు పూర్తి చేసామని దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా శనివారం తెల్లవారుజామున రెండున్నర గంటలకు గరుడాద్రి పర్వతంపై మూలవిరాట్ కు ప్రత్యేక అభిషేకము విశేష ప్రసాద నివేదనలు తీర్థ గోష్టి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొండ దిగువున గల ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి సన్నిధిలో ఉపాలయాలలోనూ నిత్య కార్యక్రమములు పూర్తి చేసిన అనంతరము తెల్లవారుజామున మూడు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు దర్శన ఏర్పాట్లు చేసినట్లు వారు చెప్పారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకున్న క్యూ లైన్లు, పండాల్స్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ ఉదయం నుండి సాయంత్రం వరకు ఉచిత ప్రసాదము పంపిణీ చేయనున్నామన్నారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారిని పుణ్యకోటి వాహనముపై అధిష్టింపజేసి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పిస్తామన్నారు .మధ్యాహ్నం మూడు గంటలకు గజ, అశ్వ, హంస వాహనంలో అధిష్టింపజేసి ఒకేసారి గ్రామ తిరువీధి సేవ నిర్వహించడం జరుగుతుందని వారు చెప్పారు.

పంపిణీ చేస్తున్న ట్రస్టు ఛైర్మన్ సురేష్

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నాతవరం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థినులకు పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను అల్లాడ జగన్నాథరావు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అల్లాడ సురేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉద్యోగాల్లో స్థిరపడ్డాక సేవ చేయాలన్నారు ఆర్థికంగా ఇబ్బంది పడితే తమకు తెలియజేస్తే సహకారం అందిస్తామన్నార. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వూడి చక్రవర్తి, హరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత పంచాడ హరినాథ్, మంగళ భాస్కర్, బల్ల అశోక్, చిక్కాల శ్రీను, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్ కె.నూకరత్నం పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఫీషరీ అసిస్టెంట్

మత్స్యకారులకు రుణాలు

ప్రజాశక్తి -కొత్తకోట:కొమరవోలు స్వదేశీ మత్స్య సహకార సంఘం మత్స్యకారులకు వైయస్సార్ మత్స్య సాగుబడి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిషరీ అసిస్టెంట్ మర్రి రమణబాబు మాట్లాడుతూ, మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్య సాగుబడి కోసం కిసాన్ క్రిడిట్ కార్డు ద్వారా రుణాలు అందించి జీవన ప్రమాణాలు మెరుగు పరిచ్చేందుకు ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టినట్టు వివరించారు. రుణం పొందిన సభ్యులు మత్స్య సంపద పెంపుకు కృషి చేయాలని కోరారు.. ఈ రుణ సహాయం తో చేప పిల్లలు కనుగోలు, పెట్టుబడులకు ఉపయోగపడతాయిని వివరించారు. ఈ కార్యక్రమంలోని ఫిషరీ శాఖ సిబ్బంది సత్యప్రసాద్, టి.నాగమణి పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న నాయకులు

నూకినాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేటలో లగుడు నూకినాయుడు 26వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నూకినాయుడు స్థూపం వద్ద గొలుగొండ, కొయ్యూరు కమ్యూనిస్టు నాయకులు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, భూములు పేదలకు దక్కాలని ఆయన పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు జెడ్పీటీసీ వారా నూకరాజు, సిపిఐ నేత ఇరువాడ దేముడు, మేకా భాస్కరరావు, లగుడు శ్రీను పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని దిగుడు పుట్టు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సుమారు 25 మందికి బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలి దుస్తులను పంపిణీ చేశారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సలీం విద్యార్థులకు క్రిస్మస్, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు యు.మహేష్, కంఠం నాయుడు, కోటి, ఈశ్వరరావు, రాంబాబు, తిరుపతి రావు, రామన్నపడాల్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు

ప్రజాశక్తి -కొత్తకోట:సేంద్రియ ఎరువులు వాడితే రైతులకు ఖర్చు తగ్గి అధిక దిగుబడి సాధించవచ్చునని కింజరపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. శుక్రవారం రావికమతం మండలం మత్సవానిపాలెం గ్రామంలో సేంద్రియ ఎరువులు వాడకం -తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగంలో సేంద్రియ ఎరువులు ఉపయోగించడంలో పంటకు చేకూరే పద్ధతులను రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు చంద్రిక, గౌతమీ, మేరీ అపరంజిత,మయూరి, నవ్యశ్రీ, రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కళాశాల విద్యార్థులు

పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని జోగుంపేట గ్రామంలో శుక్రవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, కేంద్రం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జువ్వల లక్ష్మి, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, ఈఒపిఆర్‌డి రఘురాం, ఎపిఎం మంగ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

మైదానంలో పెరిగిన చలి తీవ్రత

అవస్థలు పడుతున్న వృద్ధులు, విద్యార్థులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల వ్యాప్తంగా గడిచిన రెండు రోజులుగా చలి తీవ్రంగా పెరిగి పోవడంతో మండల వాసులు చలికి వణికి పోతున్నారు. శుక్రవారం ఉదయం కురిసిన దట్టమైన మంచు కారణంగా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి, దీంతో ప్రధానంగా రైతులు, పాడి రైతులు, మార్నింగ్ వాకర్స్, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఉదయాన్నే వివిధ ప్రాంతాలలోని పాఠశాలలకు బస్‌లు, వాహనాల్లో వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

కంపెనీని పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

'పవర్ లూమ్'కు సహకారం

ప్రజాశక్తి- చీడికాడ:గ్రామీణ ప్రాంతంలో మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు కషి చేస్తున్న పవర్ లూమ్స్ టెక్స్టైల్ సంస్థ అభివృద్ధికి తమ వంతు సహకరిస్తామని యూనియన్ బ్యాంక్ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలో మహిళల ఉపాధి కల్పనకు తోడ్పడుతున్న పవర్ లూమ్స్ టెక్స్టైల్ సంస్థను శుక్రవారం బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం హనుమ కుమారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డి ఎం సత్యనారాయణ, అంకుపాలెం బ్రాంచ్ మేనేజర్ కే శ్రీనివాస్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆరు యూనిట్ల తో నడుస్తున్న పవర్లూమ్ మరో ఆరు యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా సహాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో శ్రీనివాసరావు, మాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రాస్తారోకోలు, మానవహారాలు

-కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

తగరపువలసలో రోడ్డుపై బైఠాయించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు సమ్మెను రోజు రోజుకు ఉధృతం చేస్తున్నారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. చీడికాడలో జెసి కారను అడ్డగించారు.

హైవే దిగ్బంధం..రాస్తారోకో ఉద్రిక్తం
ఇద్దరు సిఐటియు నేతలతో సహా 58మంది అంగన్వాడీల అరెస్ట్

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహానికి ఎదురుగా ఉన్న రోడ్డులో వందలాది మంది అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషా చరణ్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. రాస్తారోకో అనంతరం సమ్మె శిబిరం కొనసాగించారు. వారి పోరాటానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, టిడిపి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ శీతల్, జనసేన యూత్ వింగ్ నాయకులు రఘు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పి.మణి, వై.తులసి, కె.నూకరత్నం, ఆర్.శోభారాణి, ఉమా, పార్వతి, ఈశ్వరమ్మ, రాధ, నాగేశ్వరి, శాంతి, కుమారి పాల్గొన్నారు.

తగరపువలస : అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా తమ ఆందోళనను ఉధృతం చేశారు. శుక్రవారం 16 వ నెంబరు జాతీయ రహదారిపై భీమిలి అర్బన్, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు పెద్ద ఎత్తున రాస్తారోకో చేసి, గంటకు పైగా రహదారిని దిగ్బంధించారు. సిఐటియు కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీని మహిళా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, అంగన్వాడీలు ముందుకు సాగడంతో మహిళా పోలీసులు వలయాకారంలో ఉంటూ వేంకటేశ్వర మెట్ట, హైవే వరకు వెళ్లారు. హైవే వద్ద రాస్తారోకోలో సిఐటియు నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతుండగా, పోలీసులు ఉన్న పళంగా అరెస్ట్ చేసి జీపులోకి ఎక్కించారు.దీంతో అంగన్వాడీలంతా జీపు ముందుకు కదలకుండా రోడ్డుపైనే బైఠాయించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది, అంగన్వాడీలు, మహిళా పోలీసులకు మధ్య తోపులాట జరిగి, పరిస్థితి అదుపు చేసే ప్రయత్నం చేశారు. పలుమార్లు పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, అంగన్వాడీలుహైవే ఎక్కే ప్రయత్నం చేయడంతో. ఓ మహిళా పోలీస్ బూటుతో తన్నడంతో అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం జేశారు.పోలీసులకు, అంగన్వాడీ లకు మధ్య పెనుగులాటలో అంగన్వాడీల యూనియన్ గౌరవా ధ్యక్షులు కె వెంకటలక్ష్మి నోటికి గాయమై, రక్త స్రావంతో స్పృహ తప్పి కిందకు పడిపోయింది. తర్వాత సిఐటియు నేతలు రవ్వ నర్సింగరావు, ఆర్ఎస్ఎన్.మూర్తితోపాటు 58మంది అంగన్వాడీలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి, విడిచిపెట్టారు. నార్త్ ఎసిపి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టిబందోబస్తు కల్పించారు.

పెందుర్తి :అంగన్వాడీలు చినముషిడివాడ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెను హేళనచేసి మాట్లాడిన మంత్రి ఉషశ్రీ చరణ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని పిఒడబ్ల్యు అధ్యక్షులు వెంకటలక్ష్మి,97వ కార్పొరేటర్ సంఘీభావం తెలిపారు. యూనియన్‌నాయకులు అప్పలనాయుడు, దేవి, బృంద, అనిత, కళ, చిన్నమ్మలు, సోమేశ్వరి, వేణు, జ్యోతి, గంగపాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి
సమ్మెకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో అంన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం కొనసాగింది. వీరికి సంఘీభావం తెలిపిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం కంటే 1000 రూపాయలు అదనంగా వేతనం పెంచుతామని గతంలో జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్చాలని, కేంద్రంతో ముడిపడిన కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టించడం సరికాదన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా అంగన్వాడీలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వేతనాలను మాత్రం పెంచలేదన్నారు.అనంతరం అబీద్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, సిఐటియు కన్వీనర్ టి.ఈశ్వరరావు, అంగన్‌వాడి నాయకులు వి.సామ్రాజ్యం, మహాలక్ష్మి, శోభా, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో రోడ్డుపై బైఠాయింపు

పాయకరావుపేట:స్థానిక బైపాస్‌లో మానవహారం చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్లు మాట్లాడుతూ, అంగన్వాడి వర్కర్లకు 26 వేల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనకాపల్లి జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, బత్తి నాగేశ్వరరావు, ఫణి, నూకరత్నం, సత్యవేణి పాల్గొన్నారు.

రావికమతం: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు. . ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్యదర్శి సత్యవేణి మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు వరలక్ష్మి పాల్గొన్నారు.

చీడికాడలో జెసి కారును చుట్టుముట్టిన అంగన్‌వాడీలు

జాయింట్ కలెక్టర్, ఆర్డీవో కార్లు అడ్డగింత

చీడికాడ:మండల కేంద్రంలో సిఐటియు నేత దేముడు నాయుడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్, నర్సీపట్నం ఆర్డీవో, తహసిల్దార్ కారులను మెయిన్ రోడ్డులో అడ్డుకున్నారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేముడు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం హామీని అమలు చేయాలన్నారు. చింతా ప్రతాప రెడ్డి అంగన్వాడీలపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వీరికి ఏపీ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి. వీఆర్ఏల సంఘం మండల నాయకులు శివ సూరిబాబు, రమణ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట నాయకులు ఎం.జానకి, రామలక్ష్మి, రాజులమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గొలుగొండ:మండలకేంద్రంలో అంగన్వాడీలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గత 11 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన

నక్కపల్లి:అంగన్వాడి వర్కర్స్ చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాయకులు దుర్గారాణి, నాయకులు కవిత, లక్ష్మీరాజ్యం, భవాని, రవణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

యస్.రాయవరం: మండల కేంద్రంలో అంగన్‌వాడీలు రాస్తారోకో నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, లక్ష్మి, సీతారత్నం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

కశింకోట:కేంద్ర ప్రభుత్వ విధానాలకు రాష్టంలో వైసిపి ప్రభుత్వం తలొగ్గకుండా అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి

జివిఎంసి వద్ద అంగన్‌వాడీల రాస్తారోకో

ప్రభుత్వం ఐసిడిఎస్‌కు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేస్తుందని, ఆ విధానాలకు వైసిపి ప్రభుత్వం వత్తాసు పలకడం దారుణమన్నారు. తమ సమస్యలపై సమ్మె చేస్తున్న అంగన్వాడీలు 11వ రోజు శుక్రవారం కూడా తమ నిరసన తెలియజేశారు. దీక్షా శిబిరం నుండి ర్యాలీగా వెళ్లి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో సిఐటియు గుర్తు సుత్తి కొడవలి ఆకారంగా ఏర్పడి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించిన నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్వాడీలకు ఇచ్చిన ట్యాబ్‌లు, చీరలు తదితర పథకానికి చేసే ఖర్చులను కూడా వారికి వేతనాలు ఇచ్చేటట్లుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకర్‌రావు, జి.కోటేశ్వరరావు, నాయకులు డి.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డిడి.వరలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగ శేషు, నాయకులు తనుజ, రామలక్ష్మి, ధనలక్ష్మి, కుమారి, రమ,

నర్సీపట్నంలో మాట్లాడుతున్న అజశర్మ

లక్ష్మి, కృష్ణవేణి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

చోడవరం : అంగన్వాడీలు 11వ రోజు స్థానిక కొత్తూరు జంక్షన్‌లో అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూడూరు వరలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు ఎస్వి నాయుడు, ఆశా కార్యకర్తల యూనియన్ నాయకులు బి వరలక్ష్మి, కే వరలక్ష్మి సంఘీభావం తెలిపారు.

మునగపాక : మండల కేంద్రంలో అంగన్వాడీలు శుక్రవారం మిట్టమధ్యాహ్నం మండుటెండను సైతం లెక్కచేయకుండా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. వీరి ఆందోళనకు సిఐటియు మండల నాయకులు ఎస్ బ్రహ్మాజీ, వ్యకాస నాయకులు ఆళ్ల మహేశ్వరరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆడారి రామలక్ష్మి, జయలక్ష్మి, సరస్వతి, హేమలత, అంజలి, నాగమణి, తులసి లక్ష్మి, ఉమా, బొడ్డేడ లక్ష్మి, భవాని, చంద్రమౌళి వెంకట సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న, సిఐటియు మండల కార్యదర్శి బీటీ దొర, యూనియన్ సభ్యులు జీ వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, అమ్మాజీ, కోమలి, రమణమ్మ పాల్గొన్నారు.

పరవాడ : స్థానిక మండలం తాసిల్దార్ కార్యాలయం దీక్షా శిబిరం నుండి శుక్రవారం ర్యాలీగా పరవాడ సబ్ స్టేషన్ జంక్షన్లోలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వివి రమణ, యూనియన్ నాయకురాలు ఎం.రమణి, పుష్ప, సిహెచ్ దేవి, ఎం రమణి, జి అమ్మాజీ, ఈశ్వరమ్మ లక్ష్మి పార్వతి, సిఐటియు నాయకులు పిడి నాయుడు పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి తాసిల్దార్ కార్యాలయం నుండి సెంటర్ వరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి, రాంబిల్లి సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, యూనియన్ నాయకులు బద్ది మంగ, ఎస్ సావిత్రి, సుజాత, నూక రత్నం, సంతోషి, రమణమ్మ, సిఐటియు నాయకులు చందక రామకృష్ణ, ఎరుపెల్లి రాము, డి కాశియా పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట నాలుగు రోడ్ల కూడలిలో అంగన్వాడీలు మోకాళ్ళతో నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు ఆది వరలక్ష్మి, అమ్మాజీ, చిలకమ్మా, ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మి, లక్ష్మి పలు గ్రామాల కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : సిఐటియు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో అంగన్వాడీలు మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గండి నాయన బాబు. ఎర్ర దేవుడు, యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు డోకల కుమారి, భవాని పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక తహసిల్దార్ కార్యాలయం దీక్షా శిబిరం నుండి అంగన్వాడీలు ర్యాలీగా ఎన్టీఆర్ జంక్షన్ వరకు వెళ్లి, అక్కడ మానవహారం నిర్వహించి ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ నాయకులు వివి రమణమ్మ, పుష్ప, జగదీశ్వరి, ఎం వరలక్ష్మి, ఎస్ రమణమ్మ, నాగమణి , సుభాషిని, శివరామలక్ష్మి, పరదేశమ్మ, సీపీఎం నేత ఉప్పాడ సత్యవతి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తాసిల్దార్ కార్యాలయం నుంచి స్టేట్ బ్యాంక్ వరకు ర్యాలీ చేసి, జంక్షన్‌లో బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సోము నాయుడు, యూనియన్ నాయకులు బి.జయలక్ష్మి, ఎస్ వరలక్ష్మి, పి నారాయణమ్మ, జి.జయలక్ష్మి, ఆర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నక్కపల్లిలో చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన